బాణసంచా నిల్వలపై నిఘా

- డివిజన్‌లో జల్లెడ పడుతున్న పోలీసులు
- గోడౌన్లు, దుకాణాల్లో తనిఖీలు
- అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు


బాణసంచా గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు


దుకాణంలో బాణసంచాను పరిశీలిస్తున్న అధికారులు

కంబాలచెరువు: వెలుగుల పండగ దీపావళి అంటే పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ ఎంతో ఇష్టం. ఆ పండగ ఎప్పుడు వస్తుందా అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారు. దీపావళి టపాసులు కాల్చినప్పుడు వచ్చే వెలుగులకు పోటీగా చిన్నారుల ముఖాలు వికసిస్తాయి. అయితే ఎంత సరదా, సంతోషం ఉంటుందో, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే ప్రమాదం జరుగుతుంది. ఇటీవల రాయవరం మండల శివారులోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు జరిగి కార్మికులు, యజమాని చనిపోయారు. దీంతో అధికారులు బాణసంచా తయారీ కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

బాణసంచా తయారీ కేంద్రాల నిర్వహణ, దుకాణాల ఏర్పాటు, అమ్మకాలకు లైసెన్సులు చాలా అవసరం. కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఆనందాన్ని పంచే దీపావళి టపాసుల పక్కనే ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని మర్చిపోతున్నారు. లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో అక్రమంగా బాణసంచాను నిల్వ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజన్‌లో బాణసంచా అక్రమ నిల్వలపై పోలీసులు దాడులు చేపట్టారు. బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని పలు ప్రాంతాలతో పాటు రూరల్ మండలం బొమ్మూరులోని బాణసంచా నిల్వ చేసిన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

సమాచారం ఇవ్వండి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణసంచాను ఎట్టి పరిస్థితిలోనూ ఇళ్ల మధ్య నిల్వ చేయరాదు. ఆ విధంగా ఎవరైనా చేస్తే వెంటనే పోలీసు అధికారులకు, అగ్నిమాపకశాఖాధికారులకు సమాచారం ఇవ్వొచ్చు. తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చు. లైసెన్సు పొందిన వారు మాత్రమే ప్రభుత్వ నిబంధలనకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు చేయాలి. ఎక్కడైనా, ఎవరైనా రహస్యంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నట్లు, నిల్వ ఉంచినట్లు తెలిస్తే ప్రజలు 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు.

పూర్తిస్థాయిలో తనిఖీలు



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బాణసంచా దుకాణాలను మూసివేస్తున్నాం. దీనిలో భాగంగానే రాజమహేంద్రవరం, కోరుకొండలోని స్టాక్ పాయింట్‌ను మూసివేశాం. పూర్తి స్థాయిలో తనిఖీలు చేసిన తర్వాతే లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. ఎవరైనా అక్రమంగా, అనధికారికంగా ఇళ్లలో బాణసంచాను నిల్వ ఉంచితే మాకు గానీ, పోలీసులకు గానీ సమాచారం ఇవ్వండి.

– పి.శ్రీనివాసరావు, అగ్నిమాపకశాఖాధికారి, రాజమహేంద్రవరం

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ప్రకాశం నగర్: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శామ్యూల్ తెలిపారు. దీనిలో భాగంగా ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రాయడుపాకలు, కొలమూరు, కొంతమూరు గ్రామంలోని పరిమినగర్, నాలుగో బ్రిడ్జి ప్రాంతం, సాయిరాం కాలనీకు సరఫరా ఉండదన్నారు.

- ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ వెంకటేశ్వర నగర్, స్వరూప నగర్, ఆర్టీసీ కాలనీ, చెరుకూరి ఫంక్షన్ హాలు రోడ్డు, గోలి రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, కోదండ రామాలయం టెంపుల్ ఏరియా, వాకర్స్ రోడ్, జేఎన్ రోడ్, ఏవీ అప్పారావు రోడ్, శ్రీనివాస నగర్, కోకా భాస్కర్ నగర్, జయశ్రీ గార్డెన్స్‌లో 5 వీధులు, పిల్లి వారి వీధి, మంతెన గార్డెన్స్, షిర్డీ సాయి మార్గ్, తోట రాములు నగర్, శారదా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఆగిపోతుందన్నారు.
- ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మున్సిపల్ ఆఫీస్ ఏరియా, కోర్టు ప్రాంతం, గోకవరం బస్టాండ్, ఆర్యాపురం, కోర్లంపేట, దేవీచౌక్, కృష్ణ నగర్, లింగం పేట, మేయర్ స్ట్రీట్, కొత్త రోడ్డు, వాంబే గృహల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

క్లుప్తంగా

19న సినీ సంగీత విభావరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సోగ్గాడు శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం నిర్వహణలో ఈ నెల 19న ఆ పాత మధురాలు పేరిట సినీ సంగీత విభావరి జరగనుంది. పద్మశ్రీ ఘంటశాల, పద్మ భూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటల కలయికతో ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు విక్రమహాల్లో ప్రారంభమవుతుంది. కాకినాడకు చెందిన ప్రఖ్యాత ఘంటశాల గాయకుడు పీవీ రమణచే ఈ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. పలువురు గాయకులు పాల్గొని పాటలు పాడతారన్నారు.

ముగిసిన బాక్సింగ్ పోటీలు

ప్రకాశం నగర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల అండర్–19 బాలుర, బాలికల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు గురువారంతో ముగిశాయి. స్థానిక ఎస్‌కేవీటీ పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, ఆర్‌ఈఓపీఏ బి.జాన్సన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ క్రీడలను విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అనంతరం బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 11 మందికి, బాలికల విభాగంలో ఎంపికైన 12 మందికి పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ప్రసాదరావు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భానుప్రసాద్‌కు పరామర్శ


భానుప్రసాద్‌ను పరామర్శిస్తున్న గొందేశి శ్రీనివాసరెడ్డి

ధవళేశ్వరం: శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పందెళ్ల భానుప్రసాద్‌ను ఆ పార్టీ నాయకుడు గొందేశి శ్రీనివాసరెడ్డి గురువారం ధవళేశ్వరంలో పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను), రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు నారాయణరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు కొటిపల్లి రవీంద్ర, కాకులపాటి కుమార్, కారి రవి తదితరులు ఉన్నారు.

రేపు ఉద్యోగుల గ్రీవెన్స్ డే

కడియం: జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా అధికారుల సమక్షంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్ విల్సన్ పాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, వ్యక్తిగత సమస్యలను రాతపూర్వకంగా సంబంధిత ఆధారాలు, రుజువులతో సమర్పించాలన్నారు. అందుకు కావాల్సిన సహాయ, సహకారాలను తమ సంఘ నాయకులు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభినందన సత్కారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఐదు దశాబ్దాలుగా గాయనిగా అలరిస్తున్న డాక్టర్ హేమనళిని రాజమహేంద్రవరం నుంచి జాతీయస్థాయి అవార్డు అందుకోవడం గర్వకారణమని నట గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అన్నారు. ఇటీవల యూట్యూబ్‌లో జాతీయ స్థాయిలో ఇండియన్ గోల్డెన్ వాయిస్ అవార్డు అందుకున్న డాక్టర్ హేమానళినికి గురువారం సాయంత్రం జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై అభినందన సత్కారం చేశారు.

సినిమాలు..



శ్యామల	: జాలీ ఎల్ఎల్‌బీ
సూర్య మినీ	: ఓజీ
సూర్య ప్యాలెస్	: తెలుసుకదా
స్వామి	: తెలుసుకదా
అనుశ్రీ	: ఓజీ
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: కాంతారా -1
ఊర్వశి	: మిత్రమండలి
మేనక	: ఇడ్లీకొట్టు
రంభ	: డ్యూడ్
అప్సర	: కాంతారా -1
అశోక	: డ్యూడ్
నామవరం	
వీఎస్ మహల్	: డ్యూడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డ్యూడ్
కడియం	
వెంకటసూర్య	: డ్యూడ్

మహిళలు హక్కులను కాపాడుకోవాలి


సమావేశంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సీటీఆర్ఐ: మహిళలు తమ హక్కులను కాపాడుకోవాలని భూమిక ఉమెన్స్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ అనుపమ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో గురువారం కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళలకు జరుగుతున్న అకృత్యాలపై ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, మహిళ పోలీసులు చర్చించారు. ప్రముఖ సామాజికవేత్త అమీర్ పాషా మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకోని రావాలంటే ముందుగా మన ఇంటి నుంచి మొదలు కావాలన్నారు. ఇంటిలో పిల్లలను పెంచడంలో వివక్ష లేకుండా, ఆడ, మగ తారతమ్యం లేకుండా చూడాలన్నారు. చిన్నప్పటి నుంచీ పిల్లలను ఆడవారిని గౌరవించడం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ప్రభావతి, సీడీపీఓ పద్మ, మెప్మా టీఎంసీ శ్రీదేవి, స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, పారా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి


సదస్సులో మాట్లాడుతున్న ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణయ్య

కంబాలచెరువు: మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయడమంటే పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్యను దూరం చేయడమేనని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణయ్య అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, ప్రభావం అనే అంశంపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు పెట్టే ఖర్చు పెట్టుబడిగా భావించకూడదని, అభివృద్ధిగా భావించాలన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం బాగుండాలన్నారు. వీటిని అందించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనన్నారు. ప్రజల ఆరోగ్యం పేరుతో ఈ కూటమి ప్రభుత్వం ఒక్కరోజు యోగా డే నిర్వహించి వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఎవ్వరికీ లాభమని ప్రశ్నించారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా, జిల్లా కమిటీ సభ్యులు కె.జ్యోతిర్మయి, డి.సాహితి, టి.సౌమ్య, కార్తిక్, హేమంత్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి షాపులకు తాత్కాలిక లైసెన్సుల జారీ

- నిబంధనలు తప్పకుండా పాటించాలి
- ఆర్డీవో కృష్ణ నాయక్



సీటీఆర్ఐ: దీపావళిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ పరిధిలో 141, రూరల్ పరిధిలో 116 బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేసినట్టు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల, సుబ్రహ్మణ్య మైదానం, క్వారీ మార్కెట్, వీఎల్ పురం జంక్షన్ పరిధిలో షాపులు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చామన్నారు. అలాగే రూరల్ మండలాల్లో ఇప్పటి వరకు 116 లైసెన్సులు జారీ చేసినట్టు వివరించారు. బాణసంచా షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా చర్యలను అమలు చేయాలని, ప్రతి షాపు వద్ద అగ్ని ప్రమాద నిరోధక పరికరాలతో ఉంచాలని ఆదేశించారు. జనావాసాల నుంచి దూరంగా ఉండాలని, గ్రౌండ్ లెవల్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం 4 బకెట్ల నీరు, 4 బకెట్ల ఇసుకతో ఫైర్ పాయింట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ ధ్రువీకరించిన ఉపకరణాలను మాత్రమే వాడాలన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలను షాపుల్లో నియమించరాదన్నారు. లైసెన్సులను బదిలీ చేయరాదన్నారు.

ప్రింటోనికాకు ప్రింట్ వీక్ ఇండియా నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అవినాష్, సతీష్, నాని

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన ప్రింటోనికా – శివరామ డిజిటల్ ప్రెస్‌కు ప్రతిష్టాత్మక ప్రింట్ వీక్ ఇండియా 2025 నేషనల్ అవార్డు లభించింది. ఈ అవార్డును సోమవారం ముంబైలో హెడ్ ఆఫ్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రింట్ వీక్ ఇండియా కల్పేష్ షా, సంజీవ్ ఆర్ ఎస్ చేతుల మీదుగా ప్రిటోనికా ల్యాబ్ సంస్థల డైరెక్టర్ పులవర్తి అవినాష్, కంపెనీ టెక్నికల్ హెడ్ ఈలి సతీష్, ప్రింటింగ్ హెడ్ బొమ్మిరెడ్డి నాని అందుకున్నారు. దేశంలోని ప్రముఖ ప్రింటింగ్ కంపెనీలు పాల్గొన్న ఈ పోటీలలో టెక్నాలజీ, ఇన్నోవేషన్, ప్రెజెంటేషన్, క్వాలిటీ స్టాండర్డ్స్ ఆధారంగా చేసుకుని ఈ అవార్డు ప్రదానం చేశారు. వరుసగా ఐదోసారి ప్రింటోనికా సంస్థకు ఈ అవార్డు వచ్చింది. గత నెల19వ తేదీన ఏసియన్ ప్రింట్ అవార్డును బ్యాంకాక్‌లో ప్రింటోనికా ప్రతినిధులు అందుకున్నారు. సంస్థ డైరెక్టర్ సత్యవరపు గోకుల మురళి, మేనేజింగ్ డైరెక్టర్ సత్యవరపు గోపాలకృష్ణ, పులవర్తి విశ్వేశ్వరరావు, రంజిత్ కుమార్ మాట్లాడుతూ వరల్డ్ క్లాస్ స్టాండర్డ్‌తో కస్టమర్లకు సేవలు అందిస్తున్నామన్నారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించండి

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం నకిలీ, కల్తీ మద్యం పెరిగిపోయిన నేపథ్యంలో సురక్షా – ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనే మొబైల్ యాప్‌ను అబ్కారీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తాము కొనుగోలు చేసిన మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలన్నారు. ఆ బాటిల్ బ్రాండ్ పేరు, లైసెన్స్ వివరాలు, తయారీ స్థలం మొదలైనవి ఫోన్ స్క్రీన్ పై కనిపిస్తాయన్నారు. నకిలీ లేదా చట్టవిరుద్ధమైన మద్యం అయితే వెంటనే హెచ్చరిక సందేశం వస్తుందన్నారు. యాప్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత రెండు ఎంపికలు కనిపిస్తాయన్నారు. ఒకటి వినియోగదారుల కోసం, ఇంకొకటి మద్యం షాపు నిర్వాహకుల కోసం కోసం ఉంటుందన్నారు.

కూటమి పాలనలో వైద్య సేవలు దూరం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- పిడింగొయ్యిలో రచ్చబండ


రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు వైద్య సేవలు దూరమయ్యాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. పిడింగొయ్యి గ్రామ పరిధిలోని జైహింద్ నగర్‌లో పార్టీ ముఖ్య నేతలు బొప్పన సుబ్బారావు, పడాల వీర రాఘవ రెడ్డి, సుందరపల్లి అనిల్ ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.మూడు వేల కోట్ల వరకూ బకాయిలు ఉండడంతో వారు వైద్య సేవలను నిలిపివేశారన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు అత్యవసర వైద్యసేవలు పొందాలంటే లక్షల రూపాయలు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ సగటున 8 వేల మంది పేదలు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు, ఇతర వైద్యసేవలు పొందుతున్నారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆ పథకం ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్యసేవలు పొందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కుట్ర

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు వైద్య విద్యను, వైద్య సేవలను దూరం చేయాలనే దుర్బుద్ధితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కాలేజీల నిర్వహణకు డబ్బు లేదనే సాకు చూపి, కూటమి నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి పాలనలో అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు.

వేగవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గ్రామ, అనుబంధ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి విప్పర్తి ఫణి కుమార్, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి రేలంగి వీర వెంకట సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివకుమార్, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, ఆచంట కళ్యాణ్, చింతపర్తి రాంబాబు, పిడింగొయ్యి గ్రామ పార్టీ నేతలు చీరా రాజు, జాజుల శ్రీను, సిరసపల్లి శంకరరావు, వేముల ఏసుబాబు, ఏరికే దుర్గారావు, ఇబ్రహీం బాషా, కడలి రాంబాబు, బండి వెంకట్రావు, కణితి లక్ష్మీనారాయణ, మాదాబత్తుల రాజు, చిన్నం ఆనంద్, మద్దిల రమణ, పల్లెటి చిన్నా, చిచ్చార చంటి పాల్గొన్నారు.

పుష్కరాల భక్తులకు అన్ని వసతులూ కల్పించాలి

- అభివృద్ధి పనులపై దృష్టి సారించండి
- అధికారులతో కమిషనర్ రాహుల్ మీనా


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా

సీటీఆర్ఐ: గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ తరఫున విస్తృత ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. ఆయన గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు దాదాపు 21 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీరు, శానిటేషన్, గ్రీనరీ పెంచాలన్నారు. ఇందుకోసం అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను తయారుచేసుకోవాలన్నారు. లక్షల్లో భక్తులు తరలి వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగునీరు, స్నానాల ఘాట్లు, అవసరమైన అన్ని వసతులు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. భక్తులు ఘాట్లకు వద్దకు చేరుకున్నప్పటి నుంచి తిరిగి బయటకు వచ్చే వరకు ఎటువంటి ఆటంకాలు ఉండకూడదన్నారు. పుష్కరాల్లో రద్దీ నియంత్రణ కోసం ప్రతీ ఘాట్ వద్ద ఏఐ టెక్నాలజీతో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా ఏఐ సహాయంతో భక్తుల రద్దీని ముందుగానే పసిగట్టి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కుంభమేళాలో ఈ విధానం విజయవంతమైందని, అందుకే గోదావరి పుష్కరాల్లోనూ అమలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే వచ్చే భక్తులకు సరిపడా వసతి సదుపాయాల కోసం పాఠశాలలు, కల్యాణ మండపాలు, హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, ఎంహెచ్ఓ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ కీర్తి చేకూరి
- జీజీహెచ్‌లో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కంబాలచెరువు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నామన్నారు. రోగులకు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, కౌన్సెలింగ్, ఫాలో అప్ సేవలను ప్రత్యేక స్పెషలిస్ట్ వైద్యులు అందిస్తున్నారన్నారు. జీజీహెచ్‌లో 484 పోస్టులు మంజూరై, 326 పోస్టులు భర్తీ కాగా, 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న పారా మెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ పోస్టులను నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. మార్చురీ విభాగంలో ప్రస్తుతం ఫ్రీజర్లు లేని కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నందున తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డెర్మటాలజీ విభాగంలో ఓపీ సంఖ్య పెరుగుతున్నందున పీజీ స్పెషలిస్టు నియామకం చేయాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై ర్యాలీ

కంబాలచెరువు: రవాణా శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ పన్నులు తగ్గించడం వల్ల రవాణా రంగంలో, వాటిపై ఆధారపడిన వారికి జరిగే మేలు జరుగుతుందన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గుతాయని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇందిరా నగర్‌కు చెందిన వి.నాగమణి (44)కి పదేళ్లుగా షుగర్ వ్యాధి ఉంది. ఆమె ఈ నెల 7న ఆస్పత్రిలో చేరింది. కాలికి పుండు పడడంతో వైద్యులు చికిత్సనందిస్తున్నారు. కాగా.. నాగమణి ఆస్పత్రిల మరుగుదొడ్డికి వెళ్లి ఎంతసేపయినా తిరిగి రాలేదు. ఆమె భర్త అక్కడకు వెళ్లి చూడగా తలుపు లోపల గడియపెట్టి ఉంది. దీంతో ఆస్పతి సిబ్బందితో కలిపి దాన్ని బద్దలుగొట్టారు. లోపల నాగమణి టాయిలెట్ కిటికీకి టవల్‌తో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. ఆమెకు వెంటనే ఆసుపత్రి వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.